చింతలూరును దత్తత తీసుకున్న ఎన్ఆర్ఐ



డస్ట్ బిన్ ప్రారంభిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరు గ్రామాన్ని ఎన్ఆర్ఐ దత్తత తీసుకున్నారని ఆ గ్రామ సర్పంచ్ మార్గాని కరుణ ఏసు, గ్రామ పెద్దలు తెలిపారు. గురువారం ఎన్ఆర్ఐ సౌజన్యంతో సమకూర్చిన డస్ట్ బిన్లను గ్రామ వీధుల్లో ఏర్పాటు చేశారు. దీనిపై గ్రామస్తులు మాట్లాడుతూ ఒక డస్ట్ బిన్ సుమారు రూ.4,500 విలువ చేస్తుందన్నారు. ఇలాంటి డస్ట్ బిన్లను గ్రామంలో మొత్తంగా 30 ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు వివరించారు. జనవరి 2, 3 తేదీల్లో ఎన్ఆర్ఐ గ్రామానికి రానున్నారని తెలియజేశారు. ఆయన ద్వారా వివరాలు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో పెద్దలు గన్ని వెంకట్రావు, వైట్ల శేషుబాబు, పెద్దింటి కాశి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో స్లూయిజ్‌లు

- ఆధునికీకరణకు నోచుకోని అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

ప్రజాశక్తి - మామిడికుదురు

వైనతేయ, వశిష్ట గోదావరి నదీ పరివాహక ప్రాంతమైన కోనసీమలో ఏటిగట్లకు అనుసంధానంగా ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు పునర్నిర్మాణానికి నోచుకోకపోవడంతో వరదల సమయంలో ఏటా రైతులు నష్టపోతున్నారు. బ్రిటిష్ కాలంలో ఏటుగట్ల వెంబడి నిర్మితమైన ఈ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు శిథిలస్థితికి చేరుకుని సక్రమంగా పనిచేయడం లేదు. భారీ వర్షాలు, వరదలు సమయంలో గ్రామాలకు గోదావరికి మధ్య అనుసంధానమైన ఈ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు కీలకపాత్ర పోషిస్తాయి. భారీ వర్షాల సమయములో ముంపు బారిన పడిన పంట పొలాలు, నీట మునిగిన గ్రామాలలో మురుగునీటిని డ్రెయిన్ల ద్వారా గోదావరిలోకి పంపించేందుకు ఈ స్లూయిజ్‌లు కీలకం. అదేవిధంగా వరదల సమయంలో గోదావరిలో పోటెత్తిన వరద నీటిని డ్రెయిన్‌లోకి రాకుండా స్లూయిజ్‌లు నిరోధిస్తాయి. ఇంతటి ప్రయోజనం ఉన్న స్లూయిజ్‌లు దశాబ్దాల నుంచి ఆధునికీకరణకు నోచుకోక తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. ఫలితంగా శిథిలస్థితికి చేరిన స్లూయిజ్‌ల వద్ద వరద సమయంలో ఏ ముప్పు పొంచి ఉందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వరద సమయంలో తాత్కాలిక రక్షణ పనులు

వరదల సమయంలో స్లూయిజ్‌ల వద్ద ఇసుక బస్తాలు, సరుగుడు బాదులు వంటివి ఏర్పాటు చేసి తాత్కాలిక రక్షణ కల్పిస్తున్నారు.



గోగన్నమఠం లో స్లాబ్ కూలిన స్లూయిజ్



ఆదుర్రులో గోడలు బీటలు వారిని స్లూయిస్

అయినప్పటికీ ప్రధానంగా షట్టర్ల తలుపులు తుప్పు పట్టిపోయి వరద నీరు డ్రెయిన్లలో ప్రవహిస్తూ చెంతనే ఉన్న నివాస గృహాలు, పంట పొలాలు ముంపు భారినపడి భారీగా నష్టపోతున్నారు. డెల్టా ఆధునికీకరణలో వీటిని నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ వీటిపై దృష్టి సారించక పోవడం బాధాకరం. డెల్టా ఆధునికీకరణ నిధులు ప్రయోజనం లేని చిన్న చిన్న పనులకు రూ.లక్షలు కేటాయించి, బహుళ ప్రయోజనం ఉన్న పనులను విస్మరిండంపై రైతుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

స్లూయిజ్‌ల ఆధునికీకరణ కార్యాచరణ కాగితాలకే పరిమితం

రాజోలు ఐలాండ్‌లోని విస్తరణకు నోచుకున్న కరకట్టల మధ్య దశాబ్దాల కాలంగా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల స్లాబులు కూలి, గోడలు బీటలు వారడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖీనేటిపల్లి మండలాల్లో సుమారు 21,170 ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. సుమారు 15,258 ఎకరాల్లో కొబ్బరి తోటలు విస్తరించి ఉన్నాయి. అంతేకాకుండా తీర ప్రాంతం వెంబడి సరుగుడు, మామిడి, జీడిమామిడి, తదితర పంటలు సాగవుతున్నాయి. ఈ సాగు భూముల మధ్య మురుగనీరు మళ్లించేందుకు రెవెన్యూ, చిన్న తరహా, మధ్యతరహా ప్రధాన మురుగునీటి కాలువలు ఉన్నాయి. బ్రిటిష్ కాలము నాటి స్లూయిజ్‌ల గోడలు బలహీనంగా మారి, తలుపులు రంధ్రాలు పడటంతో సముద్రపు పోటు నీరు, గోదావరి వరద నీరు పంట భూముల్లోకి ప్రవేశిస్తోంది. దీంతో తీవ్రంగా పంట నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడికుదురు మండల పరిధిలో గోగనమఠం, ఆదుర్రు, గ్రామా ల్లో ఉన్న కడలి, వాడబోది, బచ్చలబంధ డ్రెయిన్లు గతంలో వీటికి తలుపులు అమర్చటం వలన కొంతమేర ఇబ్బందులు తీరాయి. అయితే గోడలు బీటలు వారి, స్లాబ్‌లు కూలిపోయి, స్లూయిజ్‌లపై రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో జరిగిన ప్రమాదాలను తలచుకుంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు

సాగు భూములు బీడు భూములుగా

ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో ఒక పక్క పంట నాశనమై నష్టపోవటం ఒకటైతే, సాగు నీటి వ్యవస్థ సక్రంగా లేక మరో రకంగా రైతులు నష్టపోతున్నారు. గ్రామాలలో ముంపు నీటిని బయటకు పంపి, సముద్రం, గోదావరి పోటు నీరు పంట పొలాల్లోకి ప్రవేశించకుండా కీలకపాత్ర పోషించే స్లూయిజ్‌లు ఈ ఏడాదైనా ఆధునికీకరణకు నోచుకుంటాయో లేదోనని రైతులు ఎదురుచూస్తున్నారు. మురుగునీరు పోటెత్తి సాగు భూములు బీడు భూములుగా మారిపోతున్నాయని తీరప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

అప్పలరాజు అరెస్ట్‌కు సిపిఎం ఖండన

ప్రజాశక్తి - అమలాపురం

రైతు నాయకులు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై ప్రభుత్వం అక్రమంగా పీడీ చట్టాన్ని ప్రయోగించి అరెస్టు చేయడాన్ని సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలపై, ముఖ్యంగా భూములు కోల్పోతున్న పేద రైతులు, దళిత, గిరిజన, బలహీన వర్గాల పక్షాన నిలబడి పోరాడుతున్న అప్పలరాజుపై పీడీ చట్టం మోపడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని అన్నారు. అప్పలరాజుపై చూపిన 19 కేసులలో మెజారిటీ కేసులు కేవలం ప్రజా ఆందోళనలకు సంబంధించినవే (సెక్షన్ 151 వంటివి) అన్నారు. గత పదేళ్లుగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా అప్పల రాజు బాధితుల పక్షాన నిలబడ్డారే తప్ప, ఎక్కడా గూండాగిరీకి పాల్పడలేదని వెంకటేశ్వరరావు అన్నారు. ఫార్మా కంపెనీలు, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం, పర్యావరణాన్ని కాపాడాలని కోరుతున్న వారిని అక్రమంగా నిర్బంధించడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. కలెక్టర్లు చట్టబద్ధతను విస్మరించి ఇటువంటి ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని అన్నారు. అప్పలరాజుపై మోపిన అక్రమ పీడీ చట్టం కేసును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్యవాదులు, రైతు సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో ఈ అణిచివేతపై పెద్ద ఎత్తున ఉద్యమి స్తామని హెచ్చరించారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, ఎన్.బలరాం, నాయకులు పీతల రామ చంద్రరావు, తాటి శ్రీరామమూర్తి, సకిలే సూర్యనారాయణ, బి.సత్యనారాయణ, బి.శ్రీను తదితరులు ఉన్నారు.



పట్టణంలోని లబ్ధిదారులకు హౌసింగ్‌లోన్ పత్రాలు అందజేస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

రుణ మంజూరు పత్రాల అందజేత

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణ హౌసింగ్‌లోన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఎప్పుడు ఇళ్లు నిర్మించుకున్నా అది నారా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనేనని అన్నారు. పేదల ఇంటి కల సాకారం చేసి వారి సంతోషాన్ని కూటమి ప్రభుత్వం నిలబెట్టనుందని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే హౌసింగ్ లోన్ల విషయంలో లబ్ధిదారులు ఎవ రికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వనవసరం లేదన్నారు. లోన్ ఇప్పిస్తామని డబ్బులు ఎవరైనా అడిగితే తనకు తెలియజేయాలన్నారు. హౌసింగ్ లోన్ల విషయంలో అవకతవకలకు తావు లేకుండా తానే స్వయంగా ప్రతీ లబ్ధిదారునికి మంజూరు పత్రాలను అందజేస్తున్నానని తెలియజేశారు. పట్టణంలో 30 వార్డులకు సంబంధించి 70 మంది లబ్ధిదారులకు లోన్లు మం జూరు పత్రాలను ఎంఎల్ఎ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అధికారి జయ వెంకట లక్ష్మి, బాబ్జి, పట్టణ టిడిపి అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, కర్రి రామస్వామి, పెచ్చెట్టి విజయలక్ష్మి, కంచిపల్లి అబ్బులు, కౌన్సిలర్లు యెడీద శ్రీను, నాగదుర్గ ఆది బాబు, బొర్రా వెంకటేశ్వరరావు, గండి దేవి హారిక, స్వామి, గోలకోటి విజయలక్ష్మి, జనసేన నాయకులు పిండి రాజా, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హరిదాసుకు బియ్యం వేస్తున్న మహిళ

గ్రామాల్లో హరిదాసుల సందడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గ్రామాల్లో సంక్రాంతికి ముందే హరిదాసుల సందడి నెలకొంది. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నెల రోజులు పల్లెల్లో హడావిడి సంతరించుకుంది. ఇప్పటి నుంచి బంధువులకు పంపించేందుకు పిండి వంటలు తయారీలో గ్రామీణ ప్రాంత మహిళలు నిమగ్నమై ఉంటారు. హరిదాసులతో పాటు డూడూ బసవయ్యలు, పగటి వేషగాళ్లతో పల్లెల్లో ఏ వీధిలో చూసిన పండుగ సందడి నెలకొంది. తెల్లవారగానే మంచు తొలగకుండానే హరిదాసు కీర్తనలతో పల్లెల్లో సందడి నెలకొంది. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో హరిదాసులు రోజురోజుకీ కనుమరుగవ్వడంతో మోటార్‌సైకిళ్లపై హరిదాసులు అక్షయపాత్రను పెట్టుకుని ఇంటింటికీ తిరిగుతూ సందడి చేస్తున్నారు. గతంలో హరిదాసులు అక్షయపాత్రను తలపై పెట్టుకుని హరి కీర్తనలు పాడుకుంటూ గ్రామమంతా సందడి చేసేవారు. అయితే ఇప్పుడు ఆ సందడి రాను రానూ కనుమరుగవుతోంది. సంక్రాంతి పండగ అనగానే కొత్త అల్లుళ్లతో, కోడిపందేలతో సందడి మొదలవుతోంది. గ్రామాల్లో ఇప్పటికే సంక్రాంతి సందడి నెలకొంది.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



అమలాపురంలో క్రిస్మస్ వేడుకల్లో మంత్రి సుభాష్

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని క్రిస్మస వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్‌చేశారు. చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. **అమలాపురం:** క్రీస్తు బోధనలు ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందిస్తాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. గురువారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక మద్దాల వారి పేట, ఎంఎస్ఎన్ కాలనీ, బి ఎస్ ఆర్ కాలనీలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పళ్లంరాజుతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పేదలకు, వృద్ధులకు, వితంతులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయా చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను మంత్రి సుభాష్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పళ్లంరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ కాపరులు, సంఘ పెద్దలు, వాసంశెట్టి చినబాబు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. **రామచంద్రపురం:** రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి వాసంశెట్టి సుభాష్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.. పరస్పర సహకారం, సోదరభావంతో ముందుకు సాగుతూ రాష్ట్ర అభివృద్ధికి కలిసి కృషి చేద్దామన్నారు. ఈ క్రిస్మస్ అందరి జీవితాల్లో కొత్త ఆశలు, వెలుగులు నింపాలని మనః స్ఫూర్తిగా కోరుకుంటున్నాననీ మంత్ర సుభాష్ తెలియజేశారు. **ముమ్మిడివరం:** ప్రేమ, సోదరభావం, సామరస్యం క్రీస్తు బోధనల సారమని ఎల్.సద్దాయ్ ప్రేయర్ హౌస్ పాస్టర్ చిక్కం నవీన్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొత్త లంక గ్రామంలో పాస్టర్ ఇమ్మాన్యుయేల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పాస్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ఐక్యతకు చిహ్నమన్నారు. పాస్టర్ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ ప్రేమ, శాంతి, కరుణల సమ్మిళితమే క్రిస్మస్ వేడుకన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి, క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థనా మందిరాలను సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతి ఇంటి వద్ద, ప్రార్థనామందిరాల వద్ద క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేశారు. మండలంలోని టేకి, మాచర, నల్లూరు, కపిలేశ్వరపురం, వెదురుమూడి, కాలేరు, తాతపూడి, అంగర, పడమరఖండ్రిక, కోరుమిల్లి, తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రసంగిస్తూ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. అనంతరం పాస్టర్లు ప్రార్థనలు చేశారు. పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.



టేకిలో విద్యుద్దీపాలతో అలంకరించిన ప్రార్థనా మందిరం



కొత్తలంకలో క్రిస్మస్ వేడుకలు



ఎంఎల్ఎ వేగుళ్లను సత్కరించిన వెంకటరాజు

ఎంఎల్ఎ వేగుళ్లను కలిసిన వెంకటరాజు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం, మండపేట

టిడిపి అమలాపురం పార్లమెంట్ మెయిన్‌కమిటీ అధికార ప్రతినిధిగా నియమితులైన దేవువెంకట్రాజు(శ్రీను) గురువారం మండపేటలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్ఎ వేగుళ్లను పూలమాలతో, దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం దేవు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ రెడ్డి ప్రసాద్, చెల్లూరు గ్రామ అధ్యక్షుడు చంద్రు రాజు, నూని ఏసుబాబు, ముత్యాల పెదబాబు, మోరంపూడి రాజ్ కుమార్, దార్ల సుధీర్, దొండపాటి లక్ష్మణరావు, ముత్యాల సాయి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు నిధులు

మండపేట నియోజకవర్గంలో పలు ఆర్అండ్‌బి రహదారుల మరమ్మతులకు రూ.7.05 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఆలమూరు - కోటిపల్లి రోడ్డుకు రూ.3.10కోట్లు, తాపేశ్వరం - వెలగతోడు రోడ్డుకురూ.0.40 కోట్లు, ఇప్పనపాడు - వెలగతోడు రోడ్డుకు రూ.0.40 కోట్లు, మండపేట-జొన్నాడ-ద్వారపూడి-యానాం రోడ్లకు రూ.2.30 కోట్లు, మండపేట - కపిలేశ్వరపురం రోడ్డుకు రూ.0.85 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తామన్నారు.

విద్యాభివృద్ధికే ప్రభుత్వ ప్రాధాన్యత

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. నగర పంచాయతీ పరిధిలో మార్కెట్ ప్రాంతంలో స్థానిక డాక్టర్ ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన సముదాయ నిర్మాణ స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఆయన కెనరా బ్యాంకు సిఎస్ఆర్ నిధులు సుమారు రు.కోటి వ్యయంతో నిర్మించనున్న కళాశాల భవన సముదాయ స్థలంలో చేపట్టనున్న పనులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆయన వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు కట్టా సత్తిబాబు, దొమ్మేటి రమణ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కళాశాల భవన నిర్మాణ సముదాయాన్ని ఎంఎల్ఎ పరిశీలన

జనార్ధనస్వామిని దర్శించుకున్న రిటైర్డ్ జిల్లా జడ్జి

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామిని విశాఖపట్నం జిల్లా రిటైర్డ్ జడ్జి సూర్యారావు సతీసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు వారికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు స్వామివారి దర్శనం అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కార్టూ'నిజం'



సిద్ధమవుతున్న పందెం కోళ్లు

- రూ. 6 వేల నుంచి రూ. 25 వేల వరకూ పలుకుతున్న కోడిపుంజు ధరలు
- పందేలకు సిద్ధమవుతున్న పందెంరాయుళ్లు

ప్రజాశక్తి - రామచంద్రపురం

సంక్రాంతి పండుగ అంటే కోడిపందేలు ప్రథమ స్థానంలో నిలుస్తాయి. పండగకు పట్టణాల నుంచి వచ్చే బంధువులు, స్నేహితులు, పల్లెల్లో కొత్తగా వచ్చే అల్లుళ్ల అందరికీ కోడిపందేలు అంటేనే మక్కువ ఎక్కువ. దీంతో సంక్రాంతి పండుగ పిండి వంటలు, భోగి మంటలు, కొత్త దుస్తులు ఒక ఎత్తు అయితే కోడిపందేలు ఒక ఎత్తు. ప్రతి ఏటా కోడిపందేలు పేరిట రూ.కోట్లు చేతులు మారడం పరిపాటిగా కొనసాగుతోంది. ఈ ఏడాది పండుగ నెల ప్రారంభమైనప్పటి నుంచి పల్లెల్లోనూ పట్నాలలోనూ కోడిపుంజులను పెంచుతూ పందేలకు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఒక్కొక్క పుంజు ధర రూ.6000 నుంచి రూ.25 వేల వరకు పలుకుతోంది. ప్రతీ ఇంటి ముందు పందెం కోళ్ల సిద్ధం చేస్తూ వాటికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

పందెం కోళ్లకు ప్రత్యేకమైన తిండి

సంక్రాంతి బరిలో నిలిచే పందెం కోళ్లకు మంచి ఆహారాన్ని ఇప్పటి నుంచే అందిస్తున్నారు. ప్రతి కోడిపుంజుకు బాదంపప్పు, పిస్తా పప్పు, కోడిగుడ్లు, ఉలవలు, గంట్లు వంటి పౌష్టికాహారం అందజేస్తూ, వాటికి పలు రకాలుగా శిక్షణ ఇస్తుంటారు. దీంతో కోడి పందేనికి సిద్ధమవుతుంది. ఇక పందెం కోళ్లలో, కాకి, నెమలి, మైల, డేగ, సేతు, కొక్కిరాయి, సవల, తీతువా, తెల్ల కాకి వంటి అనేక రకాలు నాణ్యమైన జాతివిగా పందెం రాయుళ్లు అంచనా వేస్తారు. ఇక పందేల్లో కోడి కత్తులకు మంచి డిమాండ్ ఉంటుంది. కోడిపందేలు ఎక్కడ వేసిన అక్కడ కోడి కాళ్లకు కత్తులు కట్టే బ్యాచ్ సిద్ధంగా ఉంటుంది. ప్రతి పందెంలోనూ రూ.వేలు చేతులు మారుతాయి. మరీ పెద్ద పందేలు అయితే రూ.లక్షలు చేతులు మారుతాయి. పందెంలో ఓడిపోయిన పుంజును కూడా గెలిచిన వాళ్లు తీసుకువెళ్తారు.

పందెం పుంజు మాంసానికి మరింత గిరాకీ

కోడిపందేల్లో ఓడిపోయి మరణించిన కోడి పుంజుని కోస అని పిలుస్తారు. ఈ కోస మాంసం మంచి డిమాండ్ ఉంటుంది. మంచి పౌష్టికాహారం తిని పెరిగిన కోడిపుంజు మాంసం కేజీ రూ.3000 నుంచి రూ.5వేలు వరకు ధర పలుకుతోంది. అయినప్పటికీ మాంసం ప్రియులు ఎంత ధర అయినా చెల్లించి కోసమాంసాన్ని వండుకు తినేందుకు ఇష్టపడతారు. ఈ మాంసం డిమాండ్తో పలు ప్రాంతాల్లో ఉన్న వారి బంధువులకు పందెం రాయుళ్లు అందజేస్తూ ఉంటారు. కోడిపందేలు జరిగే ప్రాంతాల్లో మద్యం విక్రయాలు, గుండాట, పేకాట, వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వాహకులు ఏర్పాటు చేస్తుంటారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు ప్రతి ఏటా కోడిపందేల నిర్వహణకు ఉపయోగిస్తుంటారు. మండలంలోని వెల్ల గ్రామంలో ప్రతి ఏటా పెద్ద ఎత్తున కోడిపందేలు నిర్వహణ జరుగుతోంది. దీంతోపాటు రామచంద్రపురం, చోడవరం రోడ్డులోను, కుందూరు రోడ్ లోనూ, ద్రాక్షారామంలోను పందేలు నిర్వహిస్తారు. అదేవిధంగా కె.గంగవరం మండలంలోని కూళ్ల, పామర్రు, కుడు పూరు, పేకేరు, బాలాంతరం గ్రామాల్లోనూ పందాలు జరుగుతాయి. వీటితో పాటు కాజులూరు మండలంలోని విజయ రాయుడుపాలెం, యండమూరూ, పల్లెపాలెం, గొల్లపాలెం ప్రాంతాల్లో పందేలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది పుంజులు పందాలుకు గ్రామాల్లోనూ, పట్నాల్లోనూ సిద్ధంగా ఉన్నాయి. అయితే పండక్కి ఎన్ని రోజులు పందేలు నిర్వహిస్తారు.. ప్రభుత్వం పందేలుకు అనుమతిస్తుందా లేదా, కోడిపందేలను, అసాంఘిక కార్యక్రమాలను పోలీసులు ఎంతవరకు నియంత్రిస్తారు అనేది వేచి చూడాల్సి ఉంది.



కోడిపుంజులు

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని జె.అన్నవరం గ్రామంలో గురువారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో నివసిస్తున్న మిరియాల గణమ్మ, నూకరత్నం కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాయి. తెల్లవారుజామున సంభవించడంతో ఎటువంటి సామాన్లు తీసుకోకుండా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో రెండు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. స్థానిక టిడిపి యువకులు తక్షణ సహాయంగా 25 కిలోల బియ్యం, కూరగాయలు బాధిత కుటుంబాలకు అందజేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్ యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రాజపూడి వద్ద గురువారం తెల్లవారుజామున ఒక యువకుడు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం..రాజపూడి గ్రామానికి చెందిన కర్నాటి సతీష్ (23) కూలీ పని చేస్తూ తల్లి తండ్రులను పోషిస్తున్నాడు. ప్రతి రోజు పనికి దూరప్రాంతాలకు వెళ్లి రాత్రి సమయంలో ఇంటికి వస్తుంటాడు. అదే క్రమంలో గురువారం తెల్లవారుజామున స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మంచుకు రోడ్డు కనిపించక విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. అతని తలకు గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో గండేపల్లి మండలం జెడ్ రాగంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం



నరసింహమూర్తి(ఫైల్)

గుండెపోటుతో కౌలు రైతు మృతి చెందిన సంఘటన గోపవరంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కౌలు రైతు ములపర్తి నరసింహమూర్తి (55) కిత్తన చెరువులో రైతు దగ్గర ఎనిమిది ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ప్రతి ఏటా ముంపునకు గురై వరి పంటకు నష్టం వాటిల్లుతోంది. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో నష్టపోయి వ్యవసాయం గిట్టుబాటు కాక, అప్పులపాలై సాగుకు పెట్టుబడి లేక నెల రోజులుగా ఆందోళనతో అతను ఉన్నాడు. నరసింహమూర్తి ఇంటికొచ్చి గురువారం కుప్పకూలి గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుని కుటుంబాన్ని సర్పంచ్ కుంచే బుల్లియ్య, రాష్ట్ర అగ్రి మిషన్ డైరెక్టర్ అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ అయితాబత్తుల వెంకట కృష్ణారావు, తెలుగు రైతు మండల అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు ఆకుల వెంకటరమణ తదితరులు పరామర్శించారు. మృతుడు నరసింహమూర్తికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భవనం మెట్ల నుంచి జారిపడి యువతి మృతి

ప్రజాశక్తి - రాజోలు



భవ్యశ్రీ (ఫైల్)

భవనం మెట్ల నుంచి జారిపడి యువతి గురువారం మృతి చెందింది. శివకోటిలో కుంతలేశ్వరి అమ్మవారి జాతర ప్రారంభ వేడుకలల్లో ఈ అపశృతి చోటుచేసుకుంది. గురువారం జరగాల్సిన అమ్మవారి గ్రామ ప్రవేశం సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు కాళికాదేవి, దేవతా మూర్తుల వేషధారణతో నృత్యాలు చేసే నాట్య బృందాలను బుధవారం రాత్రి రాజమహేంద్రవరం నుంచి తీసుకువచ్చారు. వీరు బస చేసేందుకు అమ్మవారి ఆలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న మూడు అంతస్తుల కళ్యాణ మండప భవనం ఇచ్చారు. గురువారం తెల్లవారు జామున పాలపర్తి భవ్యశ్రీ (17) మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు రెండవ అంతస్తు మెట్ల నుంచి జారి పడింది. వెంటనే ఆలయ కమిటీ సభ్యులు, తోటి కళాకారులు ఆమెను రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. తలకు గాయం కావడంతో ఆమె మృతి చెందిందని వైద్యులు ధృవీకరించారు. ఆసుపత్రి వద్ద మృతురాలి తల్లి చినపాప రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. సోదరి పాలపర్తి మధు పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మానవ హక్కుల నాయకులపై దాడి అమానుషం

రాజోలు: మానవ హక్కుల నాయకులపై దాడి అమానుషమని మానవహక్కుల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు ముత్యాల శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూషి జాన్ మోషే అన్నారు. గురువారం వారు రాజోలులో విలేకరులతో మాట్లాడుతూ శివకోటి జాతర ఉత్సవాలు ప్రారంభానికి వచ్చిన కళాకారుల బృందంలో ఒక యువతి మృతి చెందిందనే విషయంపై రాజోలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మానవ హక్కుల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు జనిపల్లి సత్యానందం అలియాస్ నాని, బహుజన సమాజ్ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్చార్జి ఆకుమర్తి భూషణం విషయ సేకరణ చేస్తున్నారన్నారు. అయితే ఈ సమయంలో వారిపై అక్కడే ఉన్న స్థానిక నాయకుడు పినిశెట్టి వెంకటస్వామి అలి యాస్ బుజ్జి, అతని అనుచరులు నాని నుంచి సెల్ ఫోన్ లాక్కుని దుర్భాషలాడి కొడుతూ బయటకు లాక్కుని వచ్చారని అన్నారు. దాడికి పాల్పడి ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసుతోపాటు, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బాధితులతో కలిసి రాజోలు సిఐ టివి.నరేష్‌కుమార్ కు ఫిర్యాదు చేశారు.


హక్కులను పరిరక్షించుకోవాలి



ముమ్మిడివరంలో మనుస్మృతుల దహనం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కుల వ్యవస్థకు కారణమైన మనుస్మృతిని దహనం చేసి మానవహక్కులను పరిరక్షించుకోవాలని రిపబ్లికన్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, జన చైతన్య మండలి, పలు ప్రజా సంఘాలు శరత్ ఆధ్వర్యంలో తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ రహదారి 216 పైకి ర్యాలీగా వెళ్లి మనువు దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కుల, వర్ణ వ్యవస్థను పెంచి పోషించే మనుస్మృతిని 98 ఏళ్ళ క్రితం దహనం చేసిన అంబేద్కర్ మానవ హక్కుల పరిరక్షకుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో చీకురుమిల్లి శ్రీనివాస్, పంతగడి నరసింహమూర్తి, జె బాలకృష్ణ, యలమంచిలి బాలరాజు, బుడితి నాగేశ్వర రావు, నందికి ధనరాజు, కాశి సింహాద్రి వర్మ, రేవు త్రిమూర్తులు, గిడ్డి ప్రసాద్, జంగా చిట్టిబాబు, ప్రసాద్ లతో పాటు పలువురు పాల్గొన్నారు. **రామచంద్రపురం :** రామచంద్రపురం పట్టణ మెయిన్ రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మనుధర్మ శాస్త్రం (మనుస్మృతి) ప్రతులను దహనం చేశారు. 1927 డిసెంబర్ 25న మహాద్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనుస్మృతిని దహనం చేసిన చారిత్రక ఘటనకు నేటితో 98 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, నియోజకవర్గ బిఎస్‌పి ఉపాధ్యక్షుడు ఆలి, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ బుల్లిరాజు, జైభీం సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుబ్బల శ్రీను తదితరులు ప్రసంగించారు. భారత ప్రజలకు సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే రాజ్యాంగ విలువలే రక్షణ కవచమని చెప్పారు. అంబేద్కర్ మనుస్మృతి దహనం చేసిన రోజు మహిళలతో సహా అణగారిన వర్గాల విముక్తి పోరాటంలో ఒక చారిత్రక మలుపుగా గుర్తించాల్సిన అవసరం ఉందని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజారెడ్డి, దళిత నాయకులు వెంటపల్లి రామకృష్ణ, పట్టాభి, చిన్నరాజు, చింతాపల్లి సుధాకర్, బిఎస్‌పి నాయకులు ఆనంద్, సాయి తదితరులు పాల్గొన్నారు



రామచంద్రపురంలో మనుస్మృతి ప్రతులు దహనం



మెట్ల సత్యనారాయణరావు విగ్రహం వద్ద ప్రజాప్రతినిధులు, నాయకుల నివాళి

మానవతావాది మాజీ మంత్రి మెట్ల

ప్రజాశక్తి - అమలాపురం

టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు గొప్ప మానవతావాదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మెట్ల సత్యనారాయణరావు వర్ధంతి సందర్భంగా అమలాపురం కిమ్స్ హాస్పిటల్ ఎదురుగా గల మెట్ల సత్యనారాయణ రావు స్మృతి వనం వద్ద ఆయన విగ్రహానికి ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, మెట్ల సత్యనారాయణరావు పార్టీకి అందించిన సేవలను చిరస్మరణీయమన్నారు. ప్రజాసేవకు అంకితమైన ఆయన జీవితం పార్టీ అభివృద్ధికి, ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదపడిందన్నారు. సాధారణ కార్యకర్త నుంచి నాయకుడిగా, మంత్రిగా ఎదిగి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడిన వ్యక్తి మెట్ల సత్యనారాయణ అనికొనియాడారు. పార్టీ పట్ల అంకితభావం, క్రమశిక్షణ, నిస్వార్థ సేవాభావం ప్రతి కార్యకర్తకు ఆదర్శమని తెలిపారు. మెట్ల సత్యనారాయణ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి నిజమైన నివాళి అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ హరీష్ మాదుర్, ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, అమలాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు అడపా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు రూ.1.10 కోట్ల నిధులు

ప్రజాశక్తి - ఆలమూరు



ఎంఎల్ఎ బండారు

ఇప్పటికే మండలంలో పలు రహదారుల నిర్మాణాన్ని, మరమ్మతులను పూర్తి చేశామని, మరో రెండు రహదారుల మరమ్మతులకు రూ.1.10 కోట్ల ఆర్అండ్‌బి నిధులు మంజూరు అయ్యాయని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు తెలియజేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. జొన్నాడ నుంచి మండపేట ప్రధాన రహదారికి సంబంధించి కొత్తూరు సెంటర్ నుంచి గుమ్మిలేరు వరకూ మరమ్మతుల నిమిత్తం రూ.80 లక్షలు, చింతలూరు నుంచి సూర్యారావుపేట వరకూ రహదారి మరమ్మతుల కొరకు రూ.30 లక్షలు నిధులు మంజూరు చేసిన వాటిలో ఉన్నాయని ఆయన తెలిపారు. వీటికి వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతామని ఆయన తెలియజేశారు. దీంతో మండలంలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

ఈనెల 3న 'ప్రజాశక్తి'లో 'అధ్వానంగా జొన్నాడ - మండపేట రహదారి" కథనం ప్రచురితమైంది. ఈ వార్తలో ఉపశీర్షికన గుమ్మిలేరు పరిధి రహదారికి మరమ్మతులు జరిగేనా? కథనం ప్రచురితమైంది. దీనిపై ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, ఆర్అండ్‌బి డిఇ సూర్యనారాయణ, ఎఇ వెంకటరమణ స్పందించారు. దీనిపై ఆర్అండ్‌బి ఉన్నత అధికారులతో చర్చించి నిధులు మంజూరుకు కృషి చేసినట్లు వారు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వారు వివరించారు.



సిలిండర్ తదితర సామగ్రి అందజేస్తున్న ప్రతినిధులు, నాయకులు

లబ్ధిదారులకు 'పిఎం ఉజ్వల్ యోజన'

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని బడుగువానిలంకలో వెంకటసూర్య గ్యాస్ ఏజెన్సీ ద్వారా లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ పథకం ద్వారా సిలిండర్, స్టౌవ్ తదితర వస్తువులు అందజేశారు. గురువారం పంపిణీ చేశారు. ఎంపిటిసి సభ్యురాలు పడాల నాగలక్ష్మి, అమ్మిరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు పాలూరి గోవిందరాజు, జనసేన పార్టీ అధ్యక్షుడు మందపల్లి సోమశేఖర్, టిడిపి నాయకులు దూలం రాంబాబు, సూరపురెడ్డి సాయి, పడాల వెంకటేశ్వరరావు, అన్నందేవుల చిన్నబాబు తదితర నాయకులు చేతుల మీదుగా గ్యాస్ సామగ్రి పంపిణీచేశారు. అలాగే కొత్త రేషన్ కార్డ్ వచ్చిన వారు ఎవరైనా ఉంటే ఈ పథకాన్ని వినియోగించుకుంటారని ప్రతినిధులు, కూటమి నాయకులు కోరారు.

రంగనాగ్‌కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - సామర్లకోట

టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన నిమ్మకాయల రంగనాగ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. గురువారం అచ్చంపేటలోని ఆయన స్వగృహంలో నిమ్మకాయల రంగనాగ్‌ను నియోజవర్గానికి చెందిన టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కలిసి పూలమాలలతో సత్కరించారు. జిల్లా కమిటీకి ఎంపికైన మాజీ జడ్‌పిటిసి గుమ్మల్ల విజయలక్ష్మి, వెన్న పద్మనాభం, తాతపూడి కృష్ణబాబు, గుడాల శంకర్, బొందల రామలక్ష్మిలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే బాబు, బలుసు వాసు, ముసిరెడ్డి శ్రీరాములు, సలాది బ్రహ్మానందరావు, వీరం రెడ్డి పెదబాబు, బచ్చల జెమిని, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికు ఘన నివాళి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం, మండపేట

మండపేట మండలం ద్వారపూడి బస్టాండ్ వద్ద గురువారం అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ఆయన చేసిన సేవలు, గుర్తు చేసుకున్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంకటాల మురళీకష్ణ, నీలా సత్యనారాయణ, తెల్లాకుల శివప్రసాద్, ముత్యం మణికంఠ, కన్నా సుధీర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** హసన్ బాద గ్రామంలో వాజ్‌పేయి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారుసర్పంచ్, రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యదర్శి నాగిరెడ్డి సతీష్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వాడ్రేవు వెంకటరావు తదితరులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాజకీయాలలో నైతిక విలువలు పాటించిన మహోన్నత వ్యక్తి వాజపేయి అని, జాతీయ రహదారులను అభివృద్ధి చేయడం, భారత దేశాన్ని అణుశక్తి దేశంగా తీర్చి దిద్దారని, సర్వ శిక్ష అభియాన్ ప్రవేశపెట్టి అందరికీ విద్యని అందించి విద్యారంగంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి వీరబాబు, భలే బాబురావు, సలీమ్, వార్డు సభ్యులు చోడిశెట్టి పాండురంగారావు, గంగన్న, గొల్లపల్లి సుబ్బారాయుడు, ముద్దాల వీరబాబు, నాగంపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని కోటిపల్లి గ్రామంలో పారిశుధ్య కార్మికులు 60 మందికి దుస్తులు పంపిణీ చేశారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి 100వ పుట్టినరోజు పురస్కరించుకుని గ్రామస్తులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి వీటిని అందజేశారు. మాజీ సర్పంచ్ కర్రి చిట్టిబాబు చేతుల మీదుగా వీటిని పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు.. కార్యక్రమంలో పప్పుల సాయిబాబు, పెమ్మాడి సత్తిబాబు, ఆకేటి శ్రీకృష్ణ, అవసరాల రమణమూర్తి, గుర్రాల సత్యనారాయణ, కొప్పిశెట్టి చంద్రరావు, సలాది రామకష్ణ కే వి వి రమణ, గొడవర్తి రామకృష్ణ, పట్నాల శ్రీనివాసు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర అదనపు జడ్జి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రసిద్ధిగాంచిన పంచారామ క్షేత్రం ద్రాక్షారామం భీమేశ్వర స్వామినితెలంగాణ రాష్ట్ర అదనపు జిల్లా జడ్జి శ్రీవాణి దంపతులు గురువారం దర్శించుకున్నారు. వేద పండితులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భీమేశ్వర స్వామికి,మాణిక్యమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సేవా సంస్థ రక్షక భటులకు సత్కారం

ప్రజాశక్తి - రావులపాలెం

క్రిస్మస్ సందర్భంగా సిజిసి సామాజిక సేవా సంస్థ గోపాలపురం వారి ఆధ్వర్యంలో రక్షక భటులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. గురువారం సంస్థ ఛైర్మన్ రెవరెండ్ డాక్టర్ సుదర్శన్ క్రిస్మస్ సందర్భంగా స్థానిక పోలీసులకు సత్కరించి చేసి బహుమతులు అందజేశారు. అనంతరం ఛైర్మన్ మాట్లాడుతూ క్రిస్మస్ రోజు రక్షక భటులకు ఆత్మీయ సత్కారం ఆనందం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ట్రెజరర్ నిర్మలజ్యోతి, పాస్టర్లు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

చేనేత బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

చేనేత సహకార సంఘాల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పప్పు దుర్గారమేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సూర్యారాయ విద్యానంద గ్రంథాలయంలో చేనేత సహకార సంఘాల జెఎసి నాయకులతో కలిసి ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఆప్కో ద్వార గత కొన్ని సంవత్సరాలుగా చేనేత సహకార సంఘాలకు సుమారు రూ.170 కోట్లు బకాయిలు రావాల్సివుందన్నారు. బకాయిలను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ కల్చర్ ఫెస్ట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక అంబేద్కర్ భవనంలో ఈనెల 27, 28వ తేదీలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే కల్చర్ ఫెస్ట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిలుపునిచ్చారు. గురువారం అంబేద్కర్ భవన్ వద్ద సంబంధిత పోస్టర్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లోవరాజు, గంగా సూరిబాబు మాట్లాడుతూ నేటి యువతలో సంస్కృత సాంప్రదాయాలు మర్చిపోయి, విదేశీ సాంప్రదాయాలకు దగ్గరవుతున్నారని అన్నారు. తద్వారా యువత పెడత్రోవను పడుతుందన్నారు. సోషల్ మీడియా ఇతర కార్యక్రమాలకు ఆసక్తి చూపిస్తున్న నేటి యువతకు మన సాంప్రదాయ సంస్కృతులను తెలియచేయాలనే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ ఈ కల్చర్ ఫెస్ట్‌ను నిర్వహిస్తుందన్నారు. కల్చరల్ ఫెస్ట్‌లో విద్యా ర్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిటీ కార్యదర్శి పి.సత్యం, జిల్లా నాయకులు సంతోష్‌కుమార్, విపిన్‌కుమార్ పాల్గొన్నారు.